

దూలపల్లిలో స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తూ..



జై శ్రీరామ్

అంతా రామమయం.. ఈ జగమంతా రామస్మరణం

అంగరంగ వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు ● కనుల పండువగా శ్రీసీతారాముల కల్యాణం

శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులకు కిక్కిరిపోయాయి. జై శ్రీరామ్ నామస్మరణతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవం ఘట్టం 'న భూతో.. న భవిష్యత్'అనే విధంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. అదే విధంగా కాలనీలు, బస్తీల్లో రామ భక్తులు రాములోరి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. యువత కాషాయ జెండాలను చేతబూని రామనామాన్ని స్మరిస్తూ భారీ ఊరేగింపులు తీశారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్



దూలపల్లిలో సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు భారీగ తరలి వచ్చిన భక్తులు



కొంపల్లి నార్త్‌సిటీకాలనీలో.. బీజేపీ నేత శివాజీరాజు దంపతులు



సూరారం ఉమామహేశ్వర ఆలయంలో.. ముద్దాపురం మదన్‌గౌడ్ దంపతులు



దూలపల్లిలో సీతారముల ఊరేగింపు



అయోధ్యనగర్‌లో... కేఎం ప్రతాప్



సూరారం ఉమామహేశ్వర ఆలయంలో జరిగిన కల్యాణానికి హాజరైన భక్తజనం



జగద్గిరిగుట్ట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ నిర్వహించిన కల్యాణంలో ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ జగన్



వెంకట్రామిరెడ్డినగర్‌లో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



నిజాంపేట్‌లో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి దంపతులు



గాజులరామారంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో కాంగ్రెస్ నేత కూన శ్రీనివాస్‌గౌడ్



శ్రీరామనవమి వేడుకల్లో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నేత బొంగునూరి కిషోర్‌రెడ్డి



వెంకటరాయ్‌నగర్‌కాలనీలో జరిగిన కల్యాణంలో కొలన్ హన్మంతరెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



గాంధీనగర్‌లో సీతారాముల కల్యాణంలో కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్, ఆలయ కమిటీ



భగత్‌సింగ్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో..



దేవేందర్‌నగర్‌లో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తజనం



జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో జరిగిన కల్యాణంలో పాల్గొన్న కాలనీవాసులు



జయరామ్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రసాదం పంపిణీ చేస్తున్న ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌గౌడ్



సూరారం వెంకట్రాంనగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణంలో భక్తులు



సూరారం శ్రీరామ్‌నగర్‌లో సీతారాముల ఉత్సవ మూర్తులను తీసుకొస్తున్న భక్తులు

సీవీ అంబాజీకి విశిష్ట వ్యక్తి పురస్కారం



నిజాంపేట్: తెలంగాణాలో పేరొందిన ఆర్టిస్ట్ సీవీ అంబాజీ తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రతిఏటా ప్రకటించే విశిష్ట వ్యక్తి పురస్కారం–2024కు ఎంపికయ్యారు. ఈనెల 19న బాచుపల్లిలోని తెలుగు విశ్వ విద్యాలయంలో జరిగే కార్యక్రమంలో ఉపకులపతి తంగెడ కిషన్‌రావు చేతుల మీదుగా అవార్డుకు అందుకోనున్నారు. అంబాజీ తైలవర్ణ చిత్రాలతో తిరుపతి వెంగమాంబ అన్నదానం సత్రంలో శ్రీశైలం, మహానంది అహోబిలం, తిరుమల పంచాలయాలను ఆవిష్కరించి అబ్బుర పరిచారు. తెలంగాణ అసెంబ్లీ హాల్‌లో దివంగత ప్రధాని పీవీ నరసింహారావు నిలువెత్తు పెయింటింగ్, ప్రొఫెసర్ జయశంకర్ తైలవర్ణ చిత్రాలు అంబాజీ గీసినవే. రవీంద్ర భారతిలో కాళోజి, దాశరథి చిత్రాలు, ప్రపంచ తెలుగు మహాసభలు, యాదగిరిగుట్టలో దశవతారలు, లక్ష్మీనరసింహుని పంచ అవతరాలు అంబాజీ కుంచె నుంచి జాలు వారినవే. ఆర్టిస్ట్ సీవీ అంబాజీని విశిష్ట వ్యకి పురస్కారం వరించడం పట్ల పలువురు కళాకారులు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డాక్టరేట్ ప్రదానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సైఫాబాద్ పీజీ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు, సూర్యపేట వాసి చిట్యాల రాజుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఓయూ అనుబంధ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ అధ్యాపకులు డాక్టర్.ఏవీ కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ నెట్‌వర్క్‌కు అనుసంధానమయ్యే వివిధ రకాల స్మార్ట్ డివైజెస్‌ల అథెంటికేషన్, డాటా సెక్యూరిటీ అంశంలో ఎదురవుతున్న సవాళ్లను మెషిన్ లర్నింగ్ సహాయంతో ఎలా అధిగమించవచ్చు అనే అంశం పై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

గ్రాడ్యుయేషన్ డే



బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్ఈ (ఏఐ–ఎంఎల్)బ్రాంచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జూనియర్ విద్యార్థులు వారికి ఫేర్‌వెల్ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సిగ్నేచర్ డే ఎంతో ఆకట్టుకుంది. కాలేజీలో నాలుగేళ్లుగా గడిపిన మధుర క్షణాలను వారు గుర్తు చేసుకున్నారు. – నిజాంపేట్

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



రష్ ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జీడిమెట్ల: ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీడిమెట్ల ఫైర్ ఆఫీసర్ సుభాష్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం సుచిత్రలోని రష్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీడిమెట్ల ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాలు నివారించడానికి ఎలాంటి పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలనే దానిపై అవగాహన కల్పించింది. వాటిని ఏ విధంగా ఉపయోగించాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు.

నూతన కార్యవర్గం



జీడిమెట్ల: అపురూపాకాలనీ నూతన కార్యవర్గాన్ని ఈనెల 14వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి కోసం నిర్వహించిన ఎన్నికల్లో వీవీ రమణ 34 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల్లో కాలనీ అధ్యక్షుడిగా శీలం తిప్పారెడ్డి, వైస్‌ప్రెసిడెంట్‌గా పాలంకి రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా వీవీ రమణ, జాయింట్ సెక్రటరీగా ఈ.కృష్ణారెడ్డి, ట్రెజరర్‌గా వి.సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా బి.సురేందర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, ఎల్.సీతారామ, ఎం.హనుమంతు, ఎం.అంజయ్య, ఎస్‌కే షఫీబాబులు ఎన్నికయ్యారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



సాయినగర్‌లో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కాసాని శిరీష

నిజాంపేట్: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కాసాని శిరీష కోరారు. బుధవారం సాయినగర్‌లో ప్రగతి ఆర్ఎంపీ, పీఎంపీ సేవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో బాధపడే సామాన్యులకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. మురుకివాడ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, భారతి, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

29 నుంచి గీతా సమ్మర్ క్యాంప్

ఆల్విన్‌కాలనీ: అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు గీతా సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మహా శృంగదాస్ బుధవారం ఓ ప్రకటనలతో తెలిపారు. డిఆర్‌యస్ ఇంటర్నేషనల్ స్కూలులో ఈనెల 29 నుంచి మే 10వ తేదీ వరకు గీతా సమ్మర్ క్యాంపు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. భగవద్గీత పారాయణం, ఉపోద్ఘాతం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సింగింగ్, స్కేటింగ్, స్విమ్మింగ్, గేమ్స్, డ్రామా, దేశభక్తి కథలు, శ్లోకాలు వంటి వాటిలో తర్ఫీదు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 94404 86792.

అదనపు కట్నం వేధింపులతో మహిళ ఆత్మహత్య

సుభాష్‌నగర్: అదనపు కట్నం వేధింపులతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం లక్ష్మీనగర్‌కు చెందిన రాచకొండ రమ తన కుమార్తె పల్లవి(22)కి అదే ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి అమర్‌సాయి(30)తో 2021లో వివాహం చేసింది. వివాహ సమయంలో రూ.5 లక్షలు కట్నంగా ఇచ్చేందుకు అంగీకరించిన రమ ఆర్థిక ఇబ్బందులతో రూ.4 లక్షలు ముట్టజెప్పింది. కుమార్తె, అల్లుడు ఆమె వద్దనే ఉంటూ వచ్చారు. కొద్ది రోజుల తరువాత భర్త అమర్‌సాయి రూ.లక్ష కట్నం తేవాలని వేధింపులు మొదలుపెట్టాడు. దీంతో వేరే కాపురం పెడితే మొత్తం డబ్బులు ఇస్తానని చెప్పడంతో ఈనెల 7వ తేదీన అమర్‌సాయి వేరే ఇంట్లోకి మారాడు.

హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడు

తాగుడుకు బానిసైన అతను ప్రతిరోజు మద్యం సేవించి భార్యను శారీరకంగా, మానసికంగా హింసించడం మొదలు పెట్టాడు. ఈ నేపథ్యంలో 16వ తేదీన పల్లవి ఉరి వేసుకుందని ఆమె తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. ఘటనా స్థలానికి వెళ్లే లోపే ఆమెకు కిందకు దింపినట్లు మృతురాలి కుటుంబ సభ్యులు గుర్తించారు. తమ కుమార్తె మృతిపై అనుమానం ఉందని పోలీసులకు తెలిపారు. అల్లుడే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 2022–23 విద్యా సంవత్సరాల పీహెచ్‌డీ ప్రవేశాలను పాత పద్ధతిలో కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు అలివేలి రాజు డిమాండ్ చేశారు. గతంలో పీహెచ్‌డీ సీట్ల ఖాళీలను సేకరించిన వివరాల ప్రకారం 2022, 23 రెండు విద్యా సంవత్సరాలకు ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా భర్తీ చేయాలని సూచించారు. విద్యార్థులు నష్టపోకుండా రెండు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న సీట్లను నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలన్నారు.

మహిళ విశ్వవిద్యాలయంపై పునఃసమీక్షించండి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడంపై పునఃసమీక్షించాలని ఎన్జీవోస్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధగంగా కోఠి మహిళా కాలేజీని ఓయూ నుంచి వేరుచేసి వర్సిటీని ఏర్పాటు చేసిందని 2021 నుంచి 2024 వరకు నిధులు ఇవ్వకుండా నియామకాలు చేపట్టకుండా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కోఠి మహిళ కాలేజీని తిరిగి ఓయూ పరిధిలోని తెచ్చి విశాలమైన ప్రదేశంలో కొత్తగా మహిళా వర్సిటీని ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

కొనసాగుతున్న మధ్యాహ్న మిత భోజనం

సనత్‌నగర్: బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం దిగ్విజయంగా కొనసాగుతుంది. శ్రీరామనవమి సందర్భంగా జలప్రసాదం దాత అయిన శ్యాంసుందర్‌రాజ్, బాలాత్రిపుర సుందరి ఆధ్వర్యంలో మధ్యాహ్నం మిత భోజన కేంద్రం వద్ద దాదాపు 200 మందికి వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథరెడ్డి బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాతలుగా ఎస్.నాగరేఖ విజయశ్రీ, ఆర్‌సీకుమాలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ పార్థసారధి, కృష్ణారెడ్డి, రామమూర్తి, ప్రసాద్, విఠల్‌రెడ్డి, బీకేఎం సత్యనారాయణ, ముత్తారెడ్డి, వీర్‌రాజు, అరవింద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కులగణన చేస్తామని ప్రకటించడం హర్షణీయం

లిబర్టీ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన చేసి తీరుతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి సూచించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఈనాడు బీసీల గురించి ఆలోచించలేదని అన్నారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేస్తామని పార్టీ అధినేత రాహుల్‌గాంధీ ప్రకటించడం బీసీల్లో ఉత్సాహాన్ని ఆనందాన్ని నింపిందన్నారు. బీసీ జన గణనతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఆదివాసీ ఇలా అన్ని వర్గాల జనగణన చేస్తే ఈ సామాజిక వర్గాలు ఎంతమంది ఉన్నారు. ఎంత వెనుకబాటులో ఉన్నారు, వారికి సంక్షేమ ఫలాలు అభివృద్ధి ఫలాలు ఎలా అందించాలని యోచించడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. అంతే కాకుండా పలు గ్యారెంటీల్లో కుల గణన చేస్తామని మంచి పరిణామని ఆయన అన్నారు. 10 ఏళ్ల కేంద్రంలో ఉన్న బీజేపీ బీసీ కులగణనను చేస్తామని ప్రత్యేక మంత్రిత్వం శాఖ ఏరాపటు చేస్తామని బీసీల ఆర్థిక అభివృద్ధి కోసం అవసరమైన నిధులు కేటాయిస్తామని ఏనాడు ప్రకటించకుండా బీసీల పట్ల చిన్న చూపు చూసిందని ఆయన విమర్శించారు.

ఐదు రూపాయలకే మరో ఐదేళ్లా.?

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేయడాన్ని తన మొట్టమొదటి విజయంగా బీజేపీ తన మేనిఫెస్టోలో పేర్కొనడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. మళ్లీ గెలిస్తే ఉచిత రేషన్ ఇస్తామని మొదటి హామీ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌరీసతీష్ మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా అర్హులందరికీ రూపాయికే కేజీ బియ్యం ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రతి నెలా ఐదు రూపాయల మేర కేంద్రం ఉచితంగా అదనపు లబ్ధి చేకూరుస్తోందన్నారు. ఐదు రూపాయల ప్రయోజనాన్ని చూపిస్తూ మరో ఐదేళ్లపాటు పాలించే అవకాశాన్ని ఇవ్వాలని బీజేపీ కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆహార భద్రత చట్టం, విద్య చట్టం, అటవీ హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం ఇలా అనేక చట్టాలు తీసుకువచ్చిందన్నారు.

19, 20తేదీల్లో భౌతిక, గణితశాస్త్రాల పురోగతులపై జాతీయసదస్సు

ముషీరాబాద్: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరస్పర ఆధారిత భౌతిక, గణిత శాస్త్రాలలో ఇటీవలి పురోగతులపై ఈ నెల 19, 20 తేదీలలో జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొని, వారి పరిశోధ నాపత్రాలను సమర్పించనున్నారు. ఈ సదస్సుకు ప్రత్యేక వక్తలుగా ఆంధ్రప్రదేశ్ కాలేజ్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.బాబులతోపాటు వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ ఉన్నత విద్యావిభాగం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కమీషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ బుర్రా వెంకటేశం, తెలంగాణ విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఉస్మానియా యూనివర్సిటీ, సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ డి.కరుణాసాగర్ పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేసి సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

టాయిలెట్లను వినియోగంలోకి తీసుకురండి



రంగారెడ్డినగర్: అధికారుల ప్రణాళిక లోపంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. ప్రధాన రహదారుల వెంబడి పాదచారులు, వాహనదారుల ఉపయోగార్థం ఏర్పాటు చేసిన టాయిలెట్లు కొన్ని ప్రాంతాల్లో నిరుపయోగంగా మారుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఏపీహెచ్‌బీ కాలనీలోని పార్కును ఆనుకుని అధికారులు టాయిలెట్లను ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉంది కాని పార్కు చుట్టూ ఇనుప రక్షణ కంచెను వేయడంతో టాయిలెట్లకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. సంబంధిత అధికారులు సదరు టాయిలెట్లను ఇక్కడ నుంచి తొలగించి రద్దీగా ఉండే ప్రదేశంలో ప్రజలకు ఉపయోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.